జ్ఞానమూర్తి కళ్ళకుండాల్సిన బాండేజ్ నేలమీద పడివుంది. ఆమ్లేట్ తినే ఫోర్క్‌తో తన రెండు కళ్ళనీ పొడుచుకున్న జ్ఞానమూర్తి బాధగా దొర్లుతున్నాడు మంచంమీద. తడిసి గడ్డకట్టిన రక్తం పరుపుమీద నల్లగా అసహ్యంగావుంది—అశ్లీలవంతురాలిలా.

# పోటీ

ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి.

చిన్నవదిన ముందు గదిలో ప్రత్యక్షమైంది. అక్కయ్యతో దేన్ని గురించో మాట్లాడుతోంది.

"టేబిల్ ఫేన్‌కొని మంచిపని చేసావ్. మీ అన్నయ్య బోనస్ డబ్బుతో సీలింగు ఫేన్ కొనిపడేసారు. మధ్యగదికి మాత్రమే గాలి వస్తుంది. వంటగదిలో పక్క ఎంచక్క మీ టేబిల్‌ఫేన్ అయితే, ఏ గదికి కావాలంటే ఆ గదికి తిప్పుకోవచ్చు ఉపయోగం ఎక్కువ."

వెళ్ళబోయేముందు "వచ్చే ఆదివారం నువ్వు, అక్కయ్య, బావ మా ఇంటికి భోజనానికి రావాలి" అని ఆహ్వానించి, వస్తామనిపించుకుని వెళ్ళింది చిన్న వదిన.

అక్కయ్య రాత్రి అన్నాలముందు ఆలోచనగా అన్నది నాతో. "చిన్న వదిన మొహమాటానికి నాముందు నిన్ను మెచ్చుకుంది. కాని, సీలింగ్ ఫేన్ అయితేనే మంచిదట చెప్పింది నువ్వు రాబోయే ముందే సీలింగుకి బిగించబడి వుంటుంది కాబట్టి గదిలో అందరికి గాలి తగులు తుందట. టేబిల్ ఫేన్‌లాగా అది త్వరగా పాడవదట. తిరిగేప్పుడు దీని కొచ్చినంత చప్పుడుండదట సీలింగు ఫేన్. అయితే ఇది మార్చి సీలింగు ఫేన్ తీసుకురారాదా? ఆ డీలర్ నీ స్నేహితుడేగా"

ఇంటిలోని పోరు, పంటిలోని నొప్పి భరించటం కష్టం కాబట్టి నాకు తెలిసిన ఆఫీసర్‌ని బతిమాలి టేబిల్ ఫేన్ ఇచ్చి పైన పాతిక ఇస్తే

కుని సీలింగు ఫేన్ తెచ్చాను. అక్కయ్య ఎక్కువభాగం గడిపే వంటగదిలో బిగించాము దాన్ని.

ఇంకా తన మాట వింటున్నందుకు అక్కయ్య నన్ను రెండు రోజులపాటు మెచ్చుకుంది.

ఆదివారం ఉదయం చిన్నన్నయ్య ఇంటికి భోజనానికి వెళ్ళాము. డైనింగు టేబిల్‌ముందు చిన్న స్టూల్ వేసి టేబిల్ ఫేన్ ఒకటి అమర్చింది చిన్నవదిన మాకు, కొద్దిగా గర్వంగా.

“టేబిల్‌ఫేన్ కూడా కొన్నారా?” అడిగింది అక్కయ్య చిన్నవదినని. మొహం కొద్దిగా చిన్నబుచ్చుకొని.

“ఊహు సీలింగుఫేన్ మార్పించి మీ ఇంట్లోలాగే టేబిల్‌ఫేన్ కొనిపించాను. మీ అన్నయ నిన్నటిదాకా నామాట వింటే వట్టు ఈ విషయంలో. పోరగా పోరగా నిన్ననే కొత్తఫేన్ మార్చి తెచ్చారు”

# జోడు

ఆత్మారాంకి మొదటినుంచీ కళ్ళజోడంటే ఎలర్జీ. అదంటే చిన్నప్పుడు ఎందుకో భయంగా వుండేది. కళ్ళజోళ్ళున్నవాళ్ళు ఎత్తుకుంటే దింపేదాకా ఏడ్చేవాడు గుక్కపెట్టి.

తన స్కూల్ ఫైనల్ పరీక్ష రెండోసారికూడా తప్పినప్పుడుగానీ, బ్యాంక్‌లో ఉద్యోగం ఇంటర్వ్యూ లెవెల్‌దాకా వచ్చి తప్పిపోయినప్పుడుగానీ అంతగా బాధపడలేదు. నిజానికి అలాంటి చాలా విషాదాలని సరదాగా తీసుకున్నాడు. స్పోర్టివ్‌స్పిరిట్‌తో. కాని తన పద్దెనిమిదో ఏట కళ్ళజోడు పెట్టుకోవాల్సి వచ్చినప్పుడు మాత్రం విపరీతమయిన మానసికాందోళనకి గురయ్యాడు.